
ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద నగరోత్సవం


మూలస్థానేశ్వరుని ఆలయంలో కల్యాణోత్సవం


పినాకినీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గో పూజ


రాజరాజేశ్వరి ఆలయంలో పులివాహనంపై అమ్మవారు

ఆనందోత్సాహాలతో ఉగాది

- వైభవంగా తెలుగు సంవత్సరాది 'విశ్వావసు'
- విశేషాలంకారంలో దర్శనమిచ్చిన స్వామివారు

నెల్లూరు(బృందావనం) : విశ్వావసు నామ ఉగాది పర్వదినాన్ని ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని వివిధ ఆలయాల్లో పలు రూపాల్లో కొలువైన స్వామివారిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. షడ్రుచుల మేళవింపుతో ఉగాది పచ్చడిని ఆరగించి, బంధుమిత్రులతో ఆనందోత్సాహాలతో గడిపారు. పలు దేవస్థానాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

➡ నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి అమ్మవారి నగరోత్సవం నేత్రపర్వంగా సాగింది. తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం నుంచి ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి సంప్రదాయంగా సారెను సమర్పించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

➡ మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి మహా రుద్రాభిషేకం, పూలంగిసేవ, రాత్రి కల్యాణోత్సవం, పుష్పయాగం, పేట ఉత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. పండితుడు భాస్కర్, ఉపన్యాసకుడు కోట రాధాకృష్ణమూర్తి పంచాంగ శ్రవణం చేశారు. భువనేశ్వరి అమ్మవారు శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చారు.


వెంకటేశ్వరపురంలో స్వామి ఊరేగింపు

➡ మూలాపేట శంకరమఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఆదిత్యశర్మ పంచాంగ శ్రవణం చేశారు.

➡ రంగనాయకులపేటలోని రంగనాథస్వామి ఆలయంలో, మూలాపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. నవాబుపేటలోని ధర్మరాజస్వామి దేవస్థానంలో, రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో, మీనాక్షి సుందరేశ్వరస్వామి ఆలయంలో ఉగాది మహోత్సవాలు కనులపండువగా జరిగాయి.


జెడ్పీ వాకర్స్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

➡ రాజేంద్రనగర్‌లో ఉన్న మహాలక్ష్మి ఆలయంలో మహిళలు పెద్దఎత్తున అమ్మవారికి అంబలి సమర్పించారు.

➡ మైపాడుగేట్ దగ్గర ఉన్న ఓ కల్యాణ మండపంలో పినాకినీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత విష్వక్సేన, గణపతి, గోమాత పూజలు చేశారు. రాఘవేంద్ర గోపీస్వామి పంచాంగ శ్రవణం జరిపించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శేషాద్రి సుధీర్, మెంటా శరత్, కోశాధికారి మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో..

➡ పొదలకూరు రోడ్డులోని హైస్కూల్ ప్రాంగణంలో జెడ్పీ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఉగాదిని నిర్వహించారు. వీఎస్ ప్రసాద్ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం సీఎల్ ప్రసాద్ స్కూల్ వాచ్‌మెన్ దాసు దంపతులకు దుస్తులు పంపిణీ చేశారు.

➡ ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడు అధ్యక్షతన రాఘవాచారి పంచాంగశ్రవణం చేశారు. అనంతరం రాఘవాచారిని సత్కరించారు.

➡ ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలూరు శిరోమణిశర్మ ఉగాది పండగ విశిష్టతను వివరించారు. పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం ఆయన్ను సన్మానించారు.

➡ బీవీనగర్‌లోని పోలేరమ్మ దేవస్థానం వద్ద భవన నిర్మాణ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు, తాగునీటి ప్యాకెట్లు, మొక్కలను పంపిణీ చేశారు. నిర్వాహకులు ఎం.శ్రీనివాస్, రవీంద్ర, అంకారావు, రమేష్ పాల్గొన్నారు.

➡ మూలాపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజంలో మాచవోలు భాస్కరశర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా భాస్కరశర్మ, సాయికుమార్‌రెడ్డిలను సన్మానించారు.


ఆలూరు శిరోమణిశర్మకు సన్మానం


భాస్కరశర్మకు సన్మానం

శ్రీరామకృష్ణసేవా సమితి ఉపాధ్యక్షుడు బత్తిన సాయికుమార్‌రెడ్డి, అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య, బి.రమణయ్య, శ్రీనివాసులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

➡ **నెల్లూరు(వీఆర్సీసెంటర్) :** వెంకటేశ్వరపురంలో కొలువైన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. సాయంత్రం పల్లకి సేవ గావించారు. ఆలయ చైర్మన్ నాగిరెడ్డి, రాజేశ్వరి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అర్చకుడు సాయిభరద్వాజ పాల్గొన్నారు.

➡ 53వ డివిజన్ పునరావాస కాలనీ వాటర్ ట్యాంకు వద్ద ఉన్న పోలేరమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి విశేషాలంకరణ గావించారు. భక్తులు 18 కలశాలతో పెన్నా జలాలను సేకరించి దేవస్థానంలో అభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం జరిగింది. నాగరాజస్వామి, రఘురామిరెడ్డి, నరసింహారెడ్డి, నాగసుబ్బారెడ్డి, నల్లారెడ్డి గోపాల్‌రెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.


పోలేరమ్మతల్లి దేవస్థానంలో..

క్లుప్తంగా

క్రీడాకారుల ఎంపిక రేపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఏపీట్రాన్స్‌కో ఉత్తర్వుల మేరకు విజయవాడలో జరిగే ఇంటర్ సర్కిల్ కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ క్రీడాపోటీలకు ఎంపికలు మంగళవారం జరుగుతుందని ఎస్పీడీసీఎల్ స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ రామస్వామివేలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా విద్యుత్‌శాఖకు చెందిన రెగ్యులర్ ఉద్యోగులు, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 ఉద్యోగులు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించే సెలక్షన్ ట్రయల్స్‌కు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 90308 02038, 94946 11228, 91547 85592 నంబర్లను సంప్రదించాలని కోరారు.

దోర్నాల హరిబాబుకు అవార్డు

నెల్లూరు(బృందావనం) : నెల్లూరుకు చెందిన కళాకారుడు, నటుడు దోర్నాల హరిబాబు కళారత్న (హంస) అవార్డును సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అందుకున్నారు. ఉగాది సందర్భంగా రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతి సమితి ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఉత్సవాల్లో ఈ అవార్డును అందజేశారు.

కన్యకాపరమేశ్వరికి తులసీ పూజ



నెల్లూరు(బృందావనం) : స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి ఆదివారం పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం శ్రీరామనవమి ఉత్సవాలను అమ్మవారి సన్నిధిలో ప్రారంభించారు. ఉభయకర్తలుగా మునగా వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మీకుమారి, వెంకటసాయి లక్ష్మీదివ్య దంపతులు వ్యవహరించారు. శ్రీరామనవమి ఉత్సవాల ఉభయకర్తలుగా గుండ్లపల్లి అరవింద్‌కుమార్– సుచిత దంపతులు వ్యవహరించారు. కన్యకాపరమేశ్వరి దేవస్థానం పాలకవర్గం, మురళీకృష్ణ భక్తబృందం ఆధ్వర్యంలో లక్ష తులసి పూజ నిర్వహించారు. 108 మంది దంపతులు పాల్గొని తిరుప్పావడ సమర్పించారు. కోట గురుబ్రహ్మం, శేగు షణ్ముఖరావు, మెట్ల చిరంజీవి, జనార్దన్ పాల్గొన్నారు.

సనాతన ధర్మం ఆదర్శప్రాయం



నెల్లూరు(బృందావనం) : భారతీయ సనాతన ధర్మం ప్రపంచానికే ఆదర్శమైనదని శ్రీహంపి విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానాధీశ్వరుడు విద్యారణ్య భారతీస్వామి తెలిపారు. శివాజీసెంటర్‌లో ఉగాదిని పురస్కరించుకుని వరసిద్ధి వినాయక దేవస్థానం, టీవీఎస్ కల్యాణసదన్, సింహపురి ఉగాది ఉత్సవ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆయన ఆదివారం రాత్రి అనుగ్రహభాషణ చేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిఒక్కరూ అనుసరించాలని తెలిపారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈద్‌ను ఆనందంగా జరుపుకోవాలి

నెల్లూరు(బృందావనం) : రంజాన్ ఈద్‌ను ముస్లింలు ఆనందంగా జరుపుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా జీవించాలని అల్లాహ్‌ను కోరుకుంటున్నానన్నారు.

అల్లాహ్ ఆశీస్సులు ఉండాలి

నెల్లూరు(బృందావనం) : రంజాన్ ఈద్ సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో కఠిన ఉపవాస దీక్షలు ఆచరిస్తూ ఆధ్యాత్మిక చింతనతో దానధర్మాలు చేయడం ద్వారా సహాయ, క్షమాగుణాలు అలవరుతాయన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ఉండి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఆయురారోగ్యాలతో జీవించాలి

నెల్లూరు(బృందావనం) : రంజాన్ ఈద్ సందర్భంగా ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదివారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

సంతోషంగా ఉండాలి

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గ ముస్లింలకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిలు ఆదివారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

వాకర్స్‌కు కంటి పరీక్షలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోడ్రన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ సహకారంతో ఆదివారం వాకర్స్‌కు కంటి పరీక్షలు నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సుమారు 350 మంది వాకర్స్‌కు డాక్టర్లు భారతి, చిన్మయి, విష్ణుప్రియలు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపీనాథ్, రాఘవేంద్రశెట్టి, డీవీ సుబ్బారాజు, స్వర్ణ రమేష్‌బాబు, డాక్టర్ అంకిరెడ్డి, జయదేవ్, ఆరి, ప్రసాద్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలేవీ?

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలో టీడీపీ నేతలు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నా మంత్రి నారాయణ పట్టించుకోవడం లేదని సీపీఐ నాయకులు షాన్‌వాజ్, మున్నా ఆరోపించారు. నగరంలోని మూడో డివిజన్లో కబ్జాకు గురైన ప్రాంతంలో ఆదివారం వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక అధికార పార్టీ నాయకులు కార్పొరేషన్‌కు చెందిన స్థలాన్ని కబ్జా చేసి దుకాణాలు నిర్మిస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రూ.40 లక్షల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తే ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు మధు, మన్సూర్, గౌస్‌బాషా, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

స్వర్ణ వెంకయ్యకు పురస్కారం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : మాలల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ స్వర్ణ వెంకయ్య డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ప్రకాశం జిల్లా తూర్పునాయుడుపాళెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, మాలల ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి వెంకయ్యకు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, రాష్ట్ర మాలల ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు అశోక్‌బాబు, మహిళా అధ్యక్షురాలు రమణ, 26 జిల్లాల దళిత నాయకులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



నెల్లూరు(అర్బన్) : వైద్యారోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్స్, సూపర్‌వైజర్స్, ఎడ్యుకేటర్లకు సంబంధించి పదోన్నతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని వారు మంత్రి నారాయణకు వినతి పత్రం అందజేశారు. ఏపీ హెల్త్ ఎడ్యుకేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర జనరల్ సెక్రటరీ చేజర్ల సుధాకర్‌రావు ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు మంత్రి నారాయణను ఆయన నివాసంలో ఆదివారం కలిసి వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. పదోన్నతల ఫైల్‌ను త్వరితగతిన మూవ్ చేయాలని కోరారు. శాఖాపరంగా 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం మంత్రికి ఉగాది శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టేపాటి అశోక్ పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి పరామర్శ


వైవీ సుబ్బారెడ్డితో అనిల్


వైవీ సుబ్బారెడ్డితో పర్వతరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ ఆదివారం పరామర్శించారు. వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ ఇటీవల మృతిచెందడంతో ఒంగోలులోని ఆయన నివాసంలో కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు అనిల్‌బాబు, బిరుదవోలు శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

➡ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

యోగా శిక్షకురాలికి అవార్డు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరుకు చెందిన యోగా శిక్షకురాలు పాటూరు అరుణకుమారికి మెగా హెల్పింగ్ ఫౌండేషన్ బంగారు నంది అవార్డును అందజేసింది. ఉగాదిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని బీఎం బిర్లా సైన్స్ మ్యూజియం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సినీనటుడు బాబుమోహన్ చేతులమీదుగా ఆదివారం అవార్డు అందుకున్నారు. నిర్వాహకులు శిరీషారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

పీ-4కు తరలిన సభ్యులు



నెల్లూరు సిటీ : వెలగపూడిలో జరిగే పీ-4 కార్యక్రమానికి ఆర్డీఓ కార్యాలయం నుంచి ఆదివారం 40 మంది సభ్యులు ఆర్టీసీ బస్సులో ఆదివారం బయలుదేరారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అనూష మాట్లాడుతూ నెల్లూరు డివిజన్ నుంచి 10 మంది పొదుపు మహిళలు, 10 మంది రైతులు, 10 మంది కార్మికులు, 10 మంది విద్యార్థులు, 10 మంది కార్మికులను పంపినట్లు పేర్కొన్నారు.

సన్మానం



నెల్లూరు(అర్బన్) : పీఎంపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా వేణుగోపాల్ ఎన్నికైనందుకు పొదలకూరు రోడ్డు వియాని హోమ్‌లో ఆదివారం ఆయనకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ సేవలను నారాయణ మెడికల్ గ్రూపు ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి కొనియాడారు. అనంతరం రూడ్స్ సంస్థ చైర్మన్ రసూల్‌తో పాటు వేణుగోపాల్‌ను సన్మానించారు. పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, నాయకులు దేవరకొండ శ్రీనివాసులు, మహబూబ్‌బాషా, సత్తార్, మాలిని, హోమ్ డైరెక్టర్ సిస్టర్ రమ, మ్యాగి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నెల్లూరు(బృందావనం) : ఉగాది పండగ సందర్భంగా అన్నమయ్య సర్కిల్ దగ్గర కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్‌లో భయ్యా వెంకటరమణయ్య, సరోజనమ్మ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. దీనిని భయ్యా రవికుమార్ దంపతులు ఆరంభించారు. మదన్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భయ్యా రవి, భయ్యా రంగమల్లిక తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నెల్లూరు సిటీ : సీఎం సహాయనిధి కింద 15 మంది పేదలకు చెక్కుల రూపంలో రూ.17,82,382లను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పంపిణీ చేశారు. నారాయణ మెడికల్ కళాశాలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం వీటిని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న మంత్రి నారాయణ